# 16. రాజావారి లంగోటీ!

1857 సిపాయి తిరుగుబాటు తమ పునాదుల్నే గజగజ లాడించ టంతో బ్రిటిష్ పాలకులు పునరాలోచనలో పడ్డారు. ఆ అనుభవంతో భారతదేశంలోని సంస్థానధీశుల, రాజాల, మహారాజాల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించసాగారు.

విభజించి పాలించి, పడగొట్టి, పెత్తనం చేజిక్కించుకోవటం అనేది సహజంగా వారి రాజనీతి. ఏదో ఓ అవకతవకను ఎత్తిచూపి 'నీవు సరిగా రాజ్యం చేయటంలేదు సుమా!' అని దబాయించి, రాజుల్ని రాజ్యభ్రష్టుల్ని చేసి, వారి సంస్థానాన్ని మింగివేయటం వారి నిత్య కృత్యం.

అయితే సిపాయి తిరుగుబాటుతో వారి తల బొప్పెకట్టి, పునరాలోచనచేసి స్థానిక సలస్థానాధీశుల పట్ల ఎక్కువ శ్రద్ధ, జాగ్రత్త చూపనారంభించారు. వారికి మరిన్ని అధికారాలిచ్చారు. మరింత డబ్బు తగలేసుకునే అవకాశం కలిగించారు. స్వేచ్ఛగా విదేశ పర్యటనలు చేసేందుకు అనుమతించారు. అంతేగాక, అడపా దడపా బ్రిటిష్ చక్రవర్తి చేసే విందులకూ, నృత్యాలకూ కూడా కొందర్ని, కొందర్ని ఆహ్వానించసాగేరు. ఆ విధంగా అందర్నీ మచ్చిక చేసుకొని, విధేయులుగా ఉంచుకోగలమని ఆశించేరు.

అలాంటి విశ్వసనీయ భారతీయ సంస్థానధీశుల్లో కపూర్తలా మహారాజా జగత్‌జిత్ సింహజీవారు ఒకరు. శ్రీవారి సంస్థానం సువిశాలమైనది. ఆదాయం అపారమైనది. కనుక శ్రీవారు బాల్యంనుండీ కూడా మరెవ్వరికీ లేని కొన్ని అలవాట్లను పెంచి పోషించుకుని ప్రసిద్ధులయ్యేరు. శ్రీవారికి

సెక్సు పాఠాలు చేర్పేందుకో జాణ, ప్రేమ పాఠాలు నేర్పేందుకో అనుభ వజ్ఞురాలూ, రాణీవాసంలోని జనానా అంతట్నీ సంతృప్తిపరచగలిగే శక్తిని ప్రసాదించమని ఆపరాత్పరుడిని సదా ప్రార్థించేందుకు ఓపుల్ టైం పూజారీ ఇలా అనేకులుండేవారు.

అన్నింటికి మించి శ్రీవారికి రోజూ తలపాగా చుట్టేందుకు ఓ గెజిటెడ్ ఆఫీసరూ, లంగోటీ బిగించి సాంప్రదాయకమైన పైజమా తొడిగి, దానితాడు బిగించేందుకు ప్రత్యేకం మరో గెజిటెడ్ ఆఫీసరూ, మిగతా దుస్తులు ఎన్నికచేసి స్వయంగా తొడిగించి అలంకరించేందుకు ఇంకో గెజిటెడ్ ఆఫీసరూ, ఇలా ప్రతిపనికి ఒక్కొక్కరుండేవారు.

బాల్యంనుండీకూడదూ ఇంతఘనంగానూ గెజిటెడ్ ఆఫీసర్ల సేవలో బ్రతకటాన మహారాజా జగత్‌జిత్ సింహజీ వారు చివరికి స్వయంగా తలపాగా చుట్టుకో గలగటం గానీ, పైజమా తాళ్లు వదులు చేసుకోగలగటం గానీ, లంగోటీ ఊడదీసుకోవటం గానీ ఏదీ చేతగాని మహాపురుషులై పోయేరు. అందువల్ల శ్రీవారు ఎక్కడికి వెళ్ళినా సదా వారివెంట లంగోటీ ఆఫీసరు గారున్నూ ఉండితీరేవారు

ఓసారి మహారాజావారు అలవాటు ప్రకారం లండన్‌లోని దివ్యమైన హోటల్లో కులాసాగా కాలక్షేపం చేస్తూండగా...!

అదే సమయంలో మహా ఘనత వహించిన, రవి యస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాధినేత అయిదవ జార్జి చక్రవర్తి ఏదో సందర్భంలో ఓ విందు ఏర్పాటుచేసిమహారాజా జగత్‌జిత్ సింహజీ వారిని కూడా సగౌరవంగా ఆహ్వానించేరు.

శ్రీవారున్నూ భారతీయ మహారాజుల దర్జా, సంపద, వైభవం అన్నింటికీ ప్రతినిధిలా అలంకరించుకుని బయలుదేరారు.

రాజోచితమైన చుడీదార్ పెజమా, దానిపై వజ్రాలు పొదిగిన కోటూ, నీలమణులు పొదిగిన తలపాగా, మెడలో ముత్యాలహారం. శ్రీవారి పూర్వీకులకు నాదిర్షాచే బహూకరింపబడిన చరిత్రాత్మకమైన రత్నాలు పొదిగిన బెల్టుకు వ్రేలాడే ఖడ్గం అలంకరించుకుని శ్రీవారు దేవేంద్రుడి బొమ్మ రిదిలా వెలిగిపోతూ బకింగ్‌హాం ప్యాలెస్‌లో అడుగుపెట్టేరు. లార్డ్ చాంబర్లేన్ సగౌరంగా ఆహ్వానించి తోడ్కొనివెళ్ళి పంచమ చక్రవర్తికి స్వయంగా మహారాజాను పరిచయం చేసేరు.

మహారాజా జగత్‌జిత్ సింహజీవారు అక్కడి వైభోగాన్నీ, ఆ విందుకూ, ఆ బాల్‌డాన్సుకూ హాజరయిన మహామహుల్నీ వారి మధ్య తననూ చూసుకుని తన అదృష్టానికే ఉప్పొంగి పోయేరు. ప్రపంచ ప్రసిద్ధ భాగ్యశాలి హిజ్ హైనెస్ ఆగాఖాన్ భార్యతో శ్రీవారు కొద్దిసేపు నృత్యం కూడా చేసి అలసిపోయేరు. ఆవిడ సౌందర్యం జగత్ప్రసిద్ధం. వ్రేళ్ళమీద లెక్కబెట్టదగిన ప్రపంచంలోని అందగత్తెలో ఆవిడ మొదటిది.

ఆ విధంగా శ్రీవారు ప్రొద్దుపోయేలోగా అనేక గ్లాసుల ఖరీదైన మద్యాన్నీ, అనేకమంది ఖరీదైన రాజవంశపు స్త్రీల కౌగిట నృత్యసుఖాన్నీ పొంది అలసిపోయినవారై ఇహ చాలించి విందారగించటానికి అందరితో పాటు సిద్ధమయేరు.

విందు అద్భుతంగా ఏర్పాటు చేయబడింది. బ్రహ్మాండమైన డైనింగ్ టేబిల్‌మీద అసంఖ్యాకమైన రకరకాల వంటకాలు సువాసనలు వెదజల్లుతూ నోరూరిస్తున్నాయ్! ప్రపంచ ప్రసిద్ధమైన దాదాపు అన్ని రకాల మద్యాలూ అక్కడ అమర్చబడి ఉన్నాయ్! ఆ డైనింగ్‌హాలు కుబేరుని ఖజానాలో వజ్రాల గదిలా జేగీయమానంగా వెలిగిపోతున్నది.

ఆవిందును చూడగానే మహారాజా జగత్‌జిత్‌సింహజీవారికి అకస్మాత్తుగా తాను లావెటరీకి పోయి, ఉన్న బరువును దింపుకు రావాలని గుర్తుకు వచ్చింది.

కానీ...ఎలా...ఎలా...?? శ్రీవారి పైజమాను, లంగోటీని ఊడదీసి బిగించే గెజిటెడ్ ఆఫీసర్‌గారు బకింగ్‌హాం ప్యాలస్ బయట శ్రీవారి పరివారంతోపాటు వేచి ఉన్నారు. ఆ దివ్యభవనంలోకి రాజులూ, మహారాజులే గానీ, వారి సేవకులకు ప్రవేశార్హతలేదు. అది రాచసాంప్రదాయం.

శ్రీవారు ఏం చేయాలో తోచక ఏడుపు మొహంపెట్టి టాయిలెట్ రూం ముందు దిగులు పడుతూండగా అటు పోతున్న చక్రవర్తిగారి అంతరంగిక కార్యదర్శి సర్ క్లైప్‌విగ్రామ్ చూసి "ప్రభో !ఏమి సంగతి ?" అని ప్రశ్నించేడు.

మహారాజా వారున్నూ సిగ్గు విడచి, తన అవసరం చెప్పుకొని "కామ్రేడ్ ! నాలంగోటీ ఆఫీసర్ని లోపలికి పిలిపించి పెట్టవా ?" అని అభ్యర్థించగా...!

ఆ క్లైప్ మహాశయుడు మొదట మూర్ఛపోబోయి, ఎలాగో తమాయించుకుని "అదేలా సాధ్యం మహాప్రభో ! ఇంతవరకూ ఈ ప్యాలెస్‌లో ఆహ్వానితులే గానీ, వారి అతిధులూ సేవకులూ అడుగుపెట్టి ఉండలేదే ! పెట్టరాదని రూల్సున్నాయే ?" అని తనూ ఏడుపు మొహం పెట్టేడు.

అయినా ఆ క్లైప్‌జీ ఎంతయినా చక్రవర్తిగారి అంతరంగికుడు గనుక అర్జంటుగా అక్కడేవున్న ప్రధాని ఛాంబర్లేన్‌ను సంప్రదించి, వారి అనుమతి పొంది.. !

మహారాజా జగత్‌జిత్ సింహజీ వారి ప్రధాన సేవకుడూ, లంగోటీ గెజిటెడ్ ఆఫీసరూనైన ఇందర్‌సింగ్‌ను అర్జంటుగా లోనికి రప్పించారు అర్జంటుగా,..

రాజావారి పైజమానూ, లంగోటీనీ ఊడదీయించి శ్రీవారి బాధను వదలించేరు. అందుకు ప్రతిగా ప్రేమ పూర్వకంగా మహారాజావారు క్లైవ్ గారికో వజ్రాలహారం బహూకరించేరు.

ఆ తర్వాత క్లైవ్‌గారు చక్రవర్తిగారికి సంగతి నివేదించగా, ఆయన "ఔరా! ఈ కపూర్తలా మహారాజా అపూర్వ పురుషుడిలా ఉన్నాడే!'' అని ఆశ్చర్యం వెలిబుచ్చారట.

మహారాజా జగత్‌జిత్ సింహజీ వారికి ఈ సంఘటన ఓపెద్ద గుణ పాఠం అయింది. అందుకై శ్రీవారేం చేసేరు?...?

లంగోటీ శాస్త్రం నేర్చుకొని బాగుపడ్డారా? పైజామా బిగించు కోవటం, ఊడదీసుకోవటం నేర్చుకున్నారా?

అబ్బే! ఎబ్బెబ్బే!!

అప్పట్నించీ శ్రీవారు తన లంగోటీ గెజిటెడ్ ఆఫీసర్ను తనవెంట తీసుకువెళ్ళే అవకాశం లేని విందులకు వెళ్ళటం మానివేసేరు.

★